క్లుప్తంగా

30న మండల స్థాయి సైన్స్ ఫెయిర్

కంకిపాడు: మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ఈ నెల 30న ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ-1 శేషగిరిరావు, ఎంఈఓ-2 కె.ప్రసాద్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సైన్స్ ఫెయిర్ జరుగుతుందన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు తాము ఎంచుకున్న నమూనాలను సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించాలని చెప్పారు. ఒక్కో పాఠశాల నుంచి మూడు నమూనాలు అనుమతిస్తామని పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులతో మెరుగైన సేవలు

కంకిపాడు: రెవెన్యూ సదస్సులతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని తహసీల్దార్ వి.భావనారాయణ తెలిపారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ, రెవెన్యూ సమస్యలపై 8 అర్జీలు అందాయి. సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్, సర్వేయరు భాస్కర్‌రావు, వీఆర్‌ఓ సూరిబాబు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కంకిపాడు: క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని దాతలు ఆకాంక్షించారు. మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన సోదరీమణులు దాతలు రుగ్వేదం పద్మశ్రీ, కృష్ణశ్రీ తమ నాయనమ్మ రుగ్వేదం రాధమ్మ, అమ్మమ్మ చిలకమర్రి వరలక్ష్మీ పేరున పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

పెనమలూరు:కానూరులో 200 మంది వృద్ధులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. కొక్కిరిగడ్డ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొక్కిరిగడ్డ ఏసుపాదం జ్ఞాపకార్థం కామయ్యతోపులో వృద్ధులకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కె.జాన్‌బాబు మాట్లాడారు. ట్రస్టు సభ్యులు శ్యామ్‌బాబు, స్టాలిన్, గ్రామ పెద్దలు కోండ్రు కోటేశ్వరరావు, నూతలపాటి శివ, మంచాల చిట్టిబాబు, రమేష్, పోరుకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక రాబడి

హనుమాన్‌జంక్షన్ రూరల్:మామిడి సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులు, యాంత్రీకరణ, సరైన యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా అధిక రాబడి సాధించవచ్చని మామిడి పరిశోధనా కేంద్రం (నూజివీడు) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ కనకమహాలక్ష్మి తెలిపారు. బాపులపాడు మండలం కొత్త మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ సమీపంలోని సూక్ష్మగామ ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్‌లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మామిడి సాగులో యాంత్రీకరణ ద్వారా పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఎంటమాలజిస్ట్ డాక్టర్ శాలిరాజు ఉద్యాన అధికారి ఇ.హరిచంద్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో ఫైనల్‌కు చేరిన పీవీపీ-వీఆర్ జట్లు

పెనమలూరు:జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ ఇంటర్‌కాలేజీ క్రికెట్ పోటీల్లో ఫైనల్‌కు కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ జట్లు చేరాయి. ఫిజికల్ డైరెక్టర్ రఘు తెలిపిన వివరాల ప్రకారం... వీఆర్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన సెమీఫైనల్ పోటీల్లో ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీపై పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీఆర్‌రెడ్డి కాలేజీ జట్టు 19.4 ఓవర్లలో 98 పరుగులకు ఆల్‌అవుట్ అయ్యారు. ఆ తరువాత బ్యాటింగ్ చేసిన పీవీపీ జట్టు 14.3 ఓవర్లలోనే 99 పరుగులు చేసి సులువుగా విజయం సాధించారు. చంద్రశేఖర్ 38 పరుగులు చేశాడు. ఇక రెండవ సెమీ ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా జరగగా ఏలూరు రామచంద్ర ఇంజినీరింగ్ కాలేజీ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. ఆ తరువాత బ్యాటింగ్ చేసిన వీఆర్ జట్టు 19.2 ఓవర్లలో 136 పరుగులకు 6 వికెట్లు నష్టపోయి ఘన విజయం సాధించింది. వీఆర్ జట్టులో సుబ్రహ్మణ్యం 53 పరుగులు చేశాడు. తొలుత సెమీ ఫైనల్ మ్యాచ్‌లను కాలేజీ రిజిస్ట్రార్ రవిచంద్ర ప్రారంభించారు.

కరెంట్ చార్జీలు పెంపు దుర్మార్గం

గన్నవరం రూరల్: కరెంట్ చార్జీలను పెంచటం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు అన్నారు. కరెంట్ చార్జీల పెంపును నిరసిస్తూ మండలంలోని సూరంపల్లిలో సీపీఎం ఆధ్వార్యాన కరపత్రాలను శనివారం పంపిణీ చేశారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు.

మహానందీశ్వరుడికి ప్రత్యేక పూజలు

పెనమలూరు:యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం శ్రీనందీశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. త్రయోదశి సందర్భంగా మహానందీశ్వరుడికి అభిషేకం, అర్చన చేశారు. భక్తులు నందీశ్వరుడి నిదర్శించుకున్నారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- గ్రామాల్లో కుక్కల స్వైర విహారం
- వీధుల్లో గుంపులు, గుంపులుగా కుక్కలు
- పాదచారులు, వాహనదారులపై దాడి
- నిర్మూలనకు చర్యలు చేపట్టాలని వినతి



బండారుగూడెంలో విచ్చల విడిగా తిరుగుతున్న వీధి కుక్కలు

హనుమాన్‌జంక్షన్ రూరల్:బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధుల్లో గుంపులు, గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కలు విచ్చలవిడి తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నాయి. రహదారులపై వెళుతున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి. పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులను వీధి కుక్కలు వెంబడిస్తుండటంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండల కేంద్రమైన బాపులపాడుతో పాటుగా వేలేరు, వీరవల్లి, బండారుగూడెం, మల్లవల్లి, కొత్తపల్లి, ఆరుగొలను, కాకులపాడు గ్రామాల్లో వీధి కుక్కలు అధిక సంఖ్యలో సంచరిస్తూ ఆందోళన కలిగిస్తున్నాయి. రాత్రి వేళలో బైక్‌లపై వెళ్లుతున్న వ్యక్తులను వీధి కుక్కలు దాడి చేసేందుకు యత్నించటంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. అంతేకాక వీధి కుక్కల తాడికి అధికమై విద్యార్థులు, చిన్నారులను రోడ్లపైకి పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. వీధి కుక్కల కాటుకు గురవుతున్న వారికి ప్రభుత్వాసుపత్రుల్లో యాంటి రెబీస్ వ్యాక్సిన్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. కుక్కల నిర్మూలనపై ఆంక్షలు ఉండటంతో పంచాయతీ అధికారులు ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో విచ్చలవిడిగా పెరుగుతున్న వీధి కుక్కల నిర్మూలనకు వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించటం వల్ల కొద్ది మేరకు సమస్య పరిష్కారమవుతుంది. దీనిపై అధికారులు స్పందించి వీధి కుక్కల నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కిశోర వికాసంపై ముగిసిన శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఐ

గన్నవరం:స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో కిశోర వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ టి. స్వర్ణలత, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి. వెంకటలక్ష్మీ, ఎంఈఓలు కె. రవికుమార్, కమల, ఎస్ఐ శివప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యుక్త వయస్సులో వచ్చే మార్పులు పట్ల కిశోర బాలికలు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బాల్య వివాహాలు నియంత్రణకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆడపిల్లలు ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని చెప్పారు. ఏదైనా అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు ధైర్యంగా ముందుకొచ్చి సంబంధిత అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ నాగపద్మావతి, జె. సత్యవాణి, శక్తి టీమ్ సభ్యులు అరుణకుమారి, జ్ఞానమాధురి, చైల్డ్‌రైట్స్ సూపర్‌వైజర్ సూరిబాబు, యోగా శిక్షకులు తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాల అభ్యున్నతే ధ్యేయం



జయమ్మకు కృతిమ కాలును అందజేసిన సంస్థ కార్యవర్గం

గన్నవరం:పేద వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా మానవత స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక బుద్ధవరం రోడ్డులోని ఆర్యవైశ్య ప్రార్థన మందిరంలో శనివారం మానవత స్వచ్ఛంద సంస్థ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తొలుత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మరణానికి సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మల్లంపల్లి జయమ్మకు రూ. 40 వేలు విలువైన కృతిమ కాలును సంస్థ ద్వారా అందజేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం పది సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయాలని, కండరాల వ్యాధితో బాధపడుతున్న పాలపర్తి ప్రమోద్‌కు రూ. 40 వేలు ఖరీదైన షిఫ్టింగ్వీల్ చైర్ అందజేయాలని కార్యవర్గం తీర్మానించింది. జనవరిలో పదవ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా మారుబోయిన మాట్లాడుతూ గన్నవరంలో మానవత సంస్థను ఏర్పాటు చేసిన పది నెలలు కాలంలోనే అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. 82 మందికి ఉచితంగా ఫ్రీజర్ బాక్స్ సదుపాయం కల్పించడంతో పాటు 66 మందికి శాంతిరథం సేవలందించినట్లు తెలిపారు. గన్నవరం శాఖ అధ్యక్షులు మడుపల్లి బాలకృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి వీసం ప్రసాదవరావు, ఉపాధ్యక్షులు కేఎస్ జగదీశ్వరరావు, కోశాధికారి పొట్లూరి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నైపుణ్య శిక్షణపై అవగాహన ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఎస్ శ్రీనివాస్, వై.రామ్మోహనరావు

నున్న(విజయవాడరూరల్):నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ (సీఎస్సీ ఇండియా) విశాఖపట్నం పరస్పర ఉపాధి నైపుణ్య శిక్షణపై అవగాహన ఒప్పందం జరిగింది. వికాస్ కాలేజీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ సలహాదారు వై.రామ్మోహనరావుతో ప్రిన్సిపాల్ డాక్టర్ పిఎస్ శ్రీనివాస్ అవగాహన పత్రాలు మార్చుకున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికత మీద సి-డాక్ ద్వారా విద్యార్థులకు శిక్షణతో పాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఎన్ఐఈఎల్ఐటీ 3డి ప్రింటింగ్, రోబోటిక్ ప్రాసెసింగ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ మీద, వాధ్వాని ఫౌండేషన్ ద్వారా 21వ శతాబ్దపు ఉపాధి నైపుణ్యాలు, పారిశ్రామిక వ్యవస్థాపకత శిక్షణ అందిస్తామని కన్సల్టెంట్ వై.రామ్మోహనరావు చెప్పారు. విద్యార్థులు కళాశాలలోని సౌకర్యాలను వినియోగించుకొని భావి భారత పౌరులుగా, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని వికాస్ విద్యాసంస్థల సెక్రటరీ నరెడ్ల సత్యనారాయణరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు ఇతర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తంబి తిరునాళ్ల గోడపత్రిక ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఫాదర్లు, అధికారులు

ఉంగుటూరు: యాత్రికల రద్దీకి అనుగుణంగా మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని తంబి పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ తెలిపారు. పెద్ద అవుటపల్లిలో జనవరి 13, 14, 15 తేదీల్లో నిర్వహించే బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి మహోత్సవాల గోడ పత్రికను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహోత్సవాల ఏర్పాట్లుపై అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖలు, సంఘస్తుల సమష్టి కృషితోనే మహోత్సలు విజయవంతం అవుతాయని తహసీల్దార్ జె.విమలకుమారి చెప్పారు. పోలీస్ శాఖ నుంచి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తామని హనుమాన్‌జంక్షన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టి, తాగునీరుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఎంపీడీవో ఇ.సత్యకుమార్ ఆదేశించారు. పెద్ద అవుటపల్లి రైల్వే స్టేషన్లో ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు నిలపుదల చేసేందుకు చర్యలు తీసుకున్నారు. విజయవాడ, గన్నవరం, ఏలూరు, నూజివీడు, గుంటూరు తదితర డిపోల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతారని ఫాదర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవో పీఆర్‌డీ దిలీప్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ కరీమ్, ఫాదర్లు అఖిలాష్, జయప్రసాద్, ఏసుపాదం, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీపీ సరోజిని

విజయవాడరూరల్: గ్రామాల్లోని బాలికలకు కిశోర వికాసం పై కార్యక్రమాలు నిర్వహించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని మహిళా-శిశు సంక్షేమశాఖ ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.ఉమాదేవి అన్నారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పీడీ జి.ఉమాదేవి మాట్లాడారు.

ఉంగుటూరు: బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు.

రేపు రంగస్థల పురస్కారాలు ప్రదానం

పెనమలూరు:యనమలకుదురు గ్రామంలో ఈ నెల 30వ తేదీన రంగస్థల నటుడు గుమ్మడి జైరాజ్ 16వ స్మారక జాతీయ రంగస్థల పురస్కార అవార్డులు ప్రదానం చేస్తామని గుమ్మడి జైరాజ్ కళాపీఠం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం యనమలకుదురులో వివరాలు తెలుపుతూ ఈ నెల 30వ తేదీ సాయంత్రం గుమ్మడి రత్నకిషోర్ ప్రాంగణం పంచాయతీ గ్రౌండ్స్‌లో జాతీయ రంగస్థల పురస్కార మహోత్సవం నిర్వహిస్తాన్నారు. ఈ సందర్భంగా ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణకు గుమ్మడి జైరాజ్ 16వ స్మారక జాతీయ రంగస్థల పురస్కార అవార్డు ప్రదానం చేస్తామని తెలిపారు. అలాగే మరో 10 మంది రంగస్థల నటులను కూడా పురస్కారం అందచేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రంగస్థల నటులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు, కళాకారులు పాల్గొంటారని విజయ్‌కుమార్ తెలిపారు.

రంగధామారావు సేవలు చిరస్మరణీయం



గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు జీసస్ గ్రేస్ లెప్రసీకాలనీలో శనివారం డాక్టర్ చింతా రంగధామారావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనుభవజ్ఞులైన వైద్యుల నేతృత్వంలో రోగలకు కంటి, షుగర్, బీపీ, థైరాయిడ్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రంగధామారావు వర్ధంతిని పురస్కరించుకుని కాలనీవాసులకు పండ్లు, నూతన వస్త్రాలను పంపిణీ చేయడంతో పాటు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు కాళీకృష్ణ, ఆచార్య ఎన్‌జీ రంగా ట్రస్ట్ చైర్మన్ గోగినేని ధనశేఖర్ మాట్లాడుతూ డాక్టర్ చింతా రంగధామారావు గన్నవరం ప్రాంతంలోని పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు, ఆపరేషన్లు చేసిన గొప్ప వ్యక్తని చెప్పారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని చారిటబుల్ ట్రస్టుతో పాటు సెల్ హెల్త్ క్లినిక్ చైర్మన్ డాక్టర్ చింతా రవికుమార్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఎంఎపీపీ చైర్మన్ కొల్లి అజయ్‌రమాకాంత్, కార్యదర్శి టిఎస్ఎల్. రావు, పి. ప్రదీప్ పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి పై కేసు

పెనమలూరు:కత్తితో దాడి చేసిన వ్యక్తి పై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... పెనమలూరు ఎస్సీ కాలనీకి చెందిన కొండెపాముల మాణిక్యాలరావు గ్రామంలో టీ షాపు వద్ద ఉన్న సమయంలో ఎలమంచిలి శివ అనే వ్యక్తి బైక్ పై వెళుతూ మాణిక్యాలరావును చూసి బైక్ ఆపాడు. మాణిక్యాలరావును ఉద్దేశించి ఇక్కడ ఉన్నావు ఏమిటి.. ప్రభుత్వం మాది అంటూ బూతులు తిడుతూ చంపుతానని కత్తితో మాణిక్యాలరావు పై అకారణంగా దాడి చేశాడు. ఈ ఘటనలో మాణిక్యాలరావు చేతికి కత్తితో గాయమయింది. స్థానికులు మాణిక్యాలరావును కాపాడారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపకులాలు అన్నింటికీ న్యాయం జరిగేలా వర్గీకరణ ఉండాలి



కంకిపాడు:ఉపకులాలు అన్నింటికీ న్యాయం జరిగేలా వర్గీకరణ ఉండాలని మాదిగ సంక్షేమ సంఘం ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు లాం సురేష్, ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఏకసభ్య కమిషన్ ప్రతినిధి రాజీవ్ రంజన్ మిశ్రాను సంఘం ప్రతినిధులు శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కంకిపాడులో సురేష్ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాల్లో వర్గీకరణ అమలు జరగాలన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాన్ని వర్గీకరణ చట్టానికి లోబడి జరగాలన్నారు. అర్హత కలిగిన ఉపకులాలను జాబితాలో చేర్చి ఆయా కులాల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయ పదవులు విషయంలోనూ సామాజిక న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్ణీత వ్యవధిలో భూసమస్యల పరిష్కారం



గన్నవరం: స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు కె. వెంకటశివయ్య నేతృత్వంలో భూసమస్యలకు సంబంధించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుండి 550కు పైగా అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వినతులను నిర్ణీత కాలవ్యవధిలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య, ఈఓ చెన్నకేశవరావు, పలువురు వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కలప మాఫియాతో ఇరిగేషన్ ఉద్యోగి దందా



పెదపులిపాక వద్ద చెట్లు నరికి ట్రాక్టర్‌లో తరలిస్తున్న మాఫియా

పెనమలూరు:ఇరిగేషన్ ఉద్యోగి మద్దతుతో కలప మాఫియా రెచ్చిపోతోంది. కేఈబీ కెనాల్ కట్ట పై ఉన్న వృక్షాలను మాఫియా నరికి కలపను దోచుకుంటున్నారు. ఈ మేరకు శనివారం పెదపులిపాక గ్రామ పరిధిలో కేఈబీ కెనాల్ పై ఉన్న పెద్దపెద్ద వృక్షాలను మాఫియా మిషన్‌తో నరికి ముక్కలుముక్కలుగా చేసి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా గ్రామ పంచాయతీ అధికారులు ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. పంచాయతీ అధికారులు, గ్రామస్తులు మాఫియాను నిలదీయగా ఇరిగేషన్ ఉద్యోగి దందా వెలుగులోకి వచ్చింది. తమకు ఇరిగేషన్ ఉద్యోగి అండదండలు ఉన్నాయని, ఆయనకు సొమ్ము ఇచ్చి వృక్షాలను నరుకుతున్నామని చెప్పారు. పైగా కేఈబీ కెనాల్ కట్టను ఆక్రమించి బడ్డీ కొట్టు పెట్టుకోవాలన్నా, ప్రభుత్వ స్థలం ఆక్రమించుకోవాలన్నా ఆ ఉద్యోగి అండదండలతోనే జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. పంచాయతీ అధికారులు కలప లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇరిగేషన్ ఉద్యోగి పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా ప్రారంభమైన బాలోత్సవ్ సంబరాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రామవరప్పాడు:విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న బాలోత్సవ్ సంబరాలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వీసీఎస్‌టీఏ అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాన్ని గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. స్పోర్ట్స్, కల్చరల్ , అకడమిక్ కేటగిరీల్లో గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని అప్పుడే చదువు, క్రీడల్లో ఉన్నతంగా రాణించగలరని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రావు మాట్లాడుతూ కేవలం మార్కుల కోసం పరిగెత్తకుండా ఇలాంటి క్రీడలు ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందన్నారు. నిత్యం క్రీడలు ఆడటం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు శారీరక దారుఢ్యం సొంతమవుతుందని తెలిపారు. మార్కులే కొలమానం కాకుండా విలువలతో కూడిన విద్య అందించాలన్నారు. వీసీఎస్‌టీఏ అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2011లో మొదలైన బాలోత్సవ్ సంబరాలు 10 వసంతాలు పూర్తి చేసుకుని 11వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. కార్యక్రమంలో వీసీఎస్‌టీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవినేని కిశోర్ కుమార్, బాలోత్సవ్ చైర్మన్, కో చైర్మన్‌లు వెనిగళ్ల మురళీమోహన్, అనుమాటి చెన్నయ్య, అసోసియేషన్ కార్యదర్శి హరనాథ్, కోశాధికారి సురకాశి ఈశ్వరరావు, ఎనికేపాడు మాజీ సర్పంచ్ కోనేరు శివరామకృష్ణ (పెదబాబు) తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ



ఏకసభ్య కమిషన్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

విజయవాడరూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఉద్యమ ఫలితంగా సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు చేసుకునే అధికారం కల్పించిందని గన్నవరం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ బాధ్యులు మంద వేణుమాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మచిలీపట్నంలో ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రాను గన్నవరం నియోజకవర్గం నాయకులతో వేణుమాదిగ కలిసి వినతి పత్రం అందచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు నియమించిన కమిషన్ రిపోర్టు మాదిగ ఉపకులాలకు జరిగిన నష్టాన్ని గుర్తిస్తుందని ఆశాభావాన్ని ఆయన ప్రకటనలో వ్యక్తం చేశారు. కమిషన్ ను కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిలిముంత కోటేశ్వరరావు, పొరిటిగడ్డ దేవదాసు, చీలిబాలు, కోటా కృష్ణమోహన్, పింగళి జోజి, ప్రత్తిపాటి సుందరయ్య,లక్క పావుల అమృతరాజు, పులపాక కుమార్, వంగూరు మరియదాసు,దేవరపల్లి కోటేశ్వరరావు తదితరులున్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయం



హనుమాన్‌జంక్షన్‌లో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్:మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ దుట్టా రామచంద్రరావు అన్నారు. హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో మన్మోహన్ సింగ్ సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా పలువురు నాయకులు, పుర ప్రముఖులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆర్థిక వేత్తగా, రాజనీతిజ్ఞుడిగా మన్మోహన్‌సింగ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని డాక్టర్ దుట్టా కొనియాడారు.

పెనమలూరు:మాతృ హృదయ్ స్వచ్ఛంద్ సేవా సంఘ ఆధ్వర్యంలో అశోక్ జిమ్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి అశోక్ మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ భారతదేశాభివృద్ధికి విశేష కృషిచేశారన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2007 కళాశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ విద్య నభ్యసించిన పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకుని సందడి చేశారు. దేశంలో పలు రాష్ట్రాల్లో ఉద్యోగాల్లో స్థిరపడిన వారు, సొంతంగా కంపెనీలు నెలకొల్పిన వారు, విదేశాల్లో ఉన్నత విద్య నభ్యసిస్తున్న విద్యార్థులు సుమారు 167 మంది ఈ కలయికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో తాము చేసిన అల్లరి పనులు తలుచుకుని మురిసిపోయారు. ఒకరినొకరు నిక్‌నేమ్‌లతో పిలుచుకుంటూ ఆటపట్టించుకున్నారు. పలువురు తాము చదివిన తరగతి గదుల్లో కూర్చుని సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యా బుద్ధులు నేర్చుకుని ఉన్నత స్థానాల్లో నిలబడిన పూర్వ విద్యార్థులను అభినందించారు. ప్రస్తుత విద్యార్థులకు తమ తమ సలహాలు, సూచనలు అందించాలని కోరారు. కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు మాట్లాడుతూ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులంతా పలువురుకు ఆదర్శంగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి బోయపాటి శ్రీకృష్ణ, డీన్, కె. రమేష్, పూర్వ విద్యార్థుల సమన్వయ కర్త కృష్ణయ్య, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా దంత వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ డే



డిగ్రీలు అందజేస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు

గన్నవరం రూరల్:మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ డెంటల్ కళాశాల గ్రాడ్యుయేషన్ శనివారం ఘనంగా నిర్వహించారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని 106 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంత వైద్యులకు ఉన్నత భవిష్యత్ ఉందని చెప్పారు. సిద్ధార్థ అకాడమీ ప్రైవేటు రంగంలో 18 విద్యా సంస్థలను స్థాపించి నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. విజయవాడ ప్రాంతంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇంజినీరింగ్, మెడికల్, ఫార్మసీలతో పాటు వివిధ కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. దంత వైద్య విద్యార్థులు అత్యున్నత ప్రమాణాలతో సేవలందిస్తున్నట్లు తెలిపారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, కోశాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, కన్వీనర్ పి.నాగసాయి మధుసూదనరావు, ఏవో వై.మధుసూదనరావు , మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ పాల్గొన్నారు.